# పోలింగ్‌కు వేళాయె..

- ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది
- అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా కేంద్రాల వద్ద భారీ బందోబస్తు



భీమ్‌గల్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో అధికారులు, సిబ్బంది



సీఎంసీ వద్ద ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

రుద్రూర్/ చందూర్/ ధర్పల్లి/ సిరికొండ, మే 12 : లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌కు జిల్లావ్యాప్తంగా అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామాల్లో పోలింగ్ బూత్‌లలో సిబ్బంది అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సిబ్బంది ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. నేడు (సోమవారం) ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు.

రుద్రూర్ మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తిచేశామని ఎంపీడీవో సురేశ్‌బాబు తెలిపారు. మండలవ్యాప్తంగా 22 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

చందూర్‌లో ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని ఎలక్షన్ అధికారి రఫీ తెలిపారు. చందూర్‌లో ఆదర్శ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

ధర్పల్లిలో ఎన్నికల ప్రక్రియ ప్రశంతంగా నిర్వహించేలా భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ధర్పల్లి సీఐ భిక్షపతి తెలిపారు. ధర్పల్లి, సిరికొండ మండలాల్లో ఆయన ఆదివారం పర్యటించి పోలింగ్‌సేషన్లలో బందోబస్తును పర్యవేక్షించారు. ఎన్నికల సందర్భంగా 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ఆయన వెంట ఎస్సై విక్రమ్, సిబ్బంది ఉన్నారు.

సిరికొండ మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఎంపీడీవో లక్ష్మీప్రసాద్ పరిశీలించారు. మండలంలో మొత్తం 43 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

## డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను పరిశీలించిన కలెక్టర్

డిచ్‌పల్లి, మే 12 : డిచ్‌పల్లి మండలంలోని సీఎంసీలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఆదివారం పరిశీలించారు. ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రక్రియను పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్‌తో కలిసి పరిశీలించారు. తాగునీటి సౌకర్యంతోపాటు వైద్యశిబిరం, భోజనం, వసతిని సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎలాంటి గందరగోళానికి తావు లేకుండా సిబ్బందికి పోలింగ్ సామగ్రిని అందించేలా చూశారు. పోస్టల్ బ్యాలెట్ బాక్సులను కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య ఓట్ల లెక్కింపు కేంద్రమైన సీఎంసీ కళాశాలలోని స్ట్రాంగ్‌రూముకు ఆదివారం తరలించారు.

## బోధన్ నియోజకవర్గంలో 246 పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు

బోధన్, మే 12: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా బోధన్ సెగ్మెంట్‌లో పోలింగ్‌కు ఆదివారం అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ నిర్వహణకు సర్వం సన్నద్ధమైంది. నియోజకవర్గంలో మొత్తం 246 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటుచేశారు. పోలింగ్ స్టేషన్లకు సంబంధించిన ఎన్నికల సామగ్రి, సిబ్బంది తరలింపు, ఎన్నికల నిర్వహణకు సంబంధించిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని బోధన్ పట్టణంలోని విజయమేరీ హైస్కూల్‌లో ఏర్పాటుచేశారు. ఆదివారం ఉదయం నుంచే పోలింగ్ స్టేషన్లకు ఈవీఎంలు, వీవీ ప్యాట్లు తరలింపు ప్రారంభమైంది. బోధన్ నియోజకవర్గంలోని ప్రతి పోలింగ్ స్టేషన్‌లో ఒక ప్రిసైడింగ్ అధికారి, ఒక అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారి, ఒక పోలింగ్ ఆఫీసర్, ఇతర సిబ్బందిని నియమించారు. అదనంగా 50 మంది ప్రిసైడింగ్ అధికారులు, మరో 50 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులను రిజర్వ్‌లో ఉంచారు. బోధన్ సెగ్మెంట్‌లో మొత్తం 24 రూట్లను ఏర్పాటుచేశారు. ఒక్కో రూట్‌కు ఒక్కో సెక్టార్ ఆఫీసర్ పర్యవేక్షిస్తారు. మొత్తం పోలింగ్ నిర్వహణ కోసం 1200 మంది సిబ్బందిని నియమించారు. బోధన్ నియోజకవర్గంలో మొత్తం 59 పోలింగ్ స్టేషన్లను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించారు.

ఎన్నికల కమిషన్ ప్రచురించిన తుది ఓటర్ల జాబితా ప్రకారం బోధన్ నియోజకవర్గంలో మొత్తం 2,23,096 మందికి ఓటుహక్కు ఉంది. వీరిలో పురుషులు 1,06,372, మహిళలు 1,16,719 మంది ఉన్నారు. ఇతరులు ఐదుగురు ఉన్నారు. వీరంతా ఓటుహక్కును వినియోగించుకోనున్నారు.



ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు తరలుతున్న సిబ్బంది

## పోలింగ్‌కు సర్వం సిద్ధం

మోర్తాడ్/మాక్లూర్, మే12: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌కు మోర్తాడ్, కమ్మర్‌పల్లి, మాక్లూర్ తదితర మండలాల్లో అధికారులు సర్వం సిద్ధం చేశారు. మోర్తాడ్ మండలంలో 29 పోలింగ్‌కేంద్రాలు, కమ్మర్‌పల్లి మండలంలో 38 పోలింగ్ కేంద్రాలను అధికారులు సిద్ధం చేశారు. రెండు రోజులుగా పోలింగ్‌కేంద్రాలను గ్రామపంచాయతీ కార్యదర్శులు సిబ్బందితో శుభ్రం చేయించడం, కూలర్లు ఏర్పాటు చేయడం, టెంట్లు వేయించడం, ఓట్లు వేసేందుకు వచ్చే ప్రజల కోసం అన్ని సౌకర్యాలు ఉండేలా ఏర్పాట్లు చేశారు. ఆదివారం బస్సుల్లో సిబ్బంది వారికి కేటాయించిన పోలింగ్‌కేంద్రాలకు భీమ్‌గల్ నుంచి బస్సులో వచ్చారు.

## పోలింగ్ కేంద్రాలకు చేరిన సిబ్బంది

రెంజల్, మే 12: మండలంలోని 34 పోలింగ్ కేంద్రాలకు సామగ్రితో సిబ్బంది ఆదివారం సాయంత్రం చేరుకున్నారు. అతిసమస్యాత్మక, సమస్యత్మక పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఎన్నికల సరళిని చిత్రీకరించనున్నారు. మండలంలో డీఎస్పీ, సీఐ, ముగ్గురు ఎస్సైలు, 30 మంది కేంద్ర బలగాలు, 50 మంది రాష్ట్ర బలగాలతో ఎన్నికల ప్రశాంతంగా జరిగేలా బందోబస్తు ఏర్పాటు చేశారు.

## 22 రూట్లలో 56 ప్రత్యేక బస్సులు

ఆర్మూర్‌టౌన్, మే12: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఆర్మూర్ నియోజకం పరిధిలో 22 రూట్లలో 56 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ రాజాగౌడ్ తెలిపారు. అనంతరం ఎన్నికల అధికారులు ఎన్నికల సామగ్రి తీసుకొని పోలింగ్ కేంద్రాలకు బస్సులో వెళ్లారు.

## పోలింగ్ కేంద్రం తనిఖీ

ఆర్మూర్ మండలంలోని అంకాపూర్ గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని సీపీ కమలేశ్వర్ తనిఖీ చేశారు. ఓటర్లు తమ ఓటు హక్కు స్వేచ్ఛగా వినియోగించుకోవాలని అన్నారు. పార్లమెంట్ ఎన్నికలు శాంతియుత వాతావరణంలో నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

## భద్రత ఏర్పాటు చేశాం

పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశామని ఆర్మూర్ ఏసీపీ బస్వారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలు నిర్భయంగా నిష్పక్షపాతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

## ఏర్పాట్లు పూర్తి

భీమ్‌గల్, మే 12: బాల్కొండ నియోజకవర్గంలో పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఎన్నికల అధికారి, అదనపు కలెక్టర్ అంకిత్ తెలిపారు.



బోధన్‌లోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో పోలింగ్ సిబ్బంది కోలాహలం



బోధన్ నుంచి పోలింగ్ స్టేషన్లకు వెళ్తున్న సిబ్బంది



భీమ్‌గల్‌లో అధికారులు, సిబ్బందికి సూచనలిస్తున్న రిటర్నింగ్ అధికారి అంకిత్



బోధన్‌లో సూచనలిస్తున్న రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో అంబాదాస్ రాజేశ్వర్



సిరికొండలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో లక్ష్మీప్రసాద్



సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు తరలిచేందుకు ఏర్పాటు చేసిన బస్సులు



ఆర్మూర్ మండలం అంకాపూర్‌లో పోలీసులతో మాట్లాడుతున్న సీపీ కల్మేశ్వర్



మోర్తాడ్‌లో పోలింగ్‌కేంద్రంలో సామగ్రిని సరి చేసుకుంటున్న సిబ్బంది



కమ్మర్‌పల్లి పోలింగ్‌కేంద్రానికి చేరుకున్న సిబ్బంది



ఆర్మూర్ నుంచి పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న ఎన్నికల అధికారులు, సిబ్బంది



రెంజల్ మండలం కందకుర్తిలో సిబ్బందికి సూచనలిస్తున్న సీఐ కృష్ణారెడ్డి



మాక్లూర్ మండలం మాదాపూర్‌లోని పోలింగ్ కేంద్రానికి వచ్చిన ఎన్నికల అధికారులు



ఆర్మూర్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో అధికారులు, సిబ్బంది



చందూర్‌లోని ఆదర్శ పోలింగ్ కేంద్రం వద్ద అధికారులు, ఎన్నికల సిబ్బంది


నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

**CHANGE OF NAME**

★I, **YAMAPURAM RAJESH,** H.No.5-84, Hasakothur, (M) Kammarpally, (D) NZB. changed my Name as **YAMAPURAM RAJESHWAR S/o.YAMAPURAM LINGANNA**
**NTZ-324811**

**CHANGE OF NAME**

★I, **YAMAPURAM LAVANYA,** H.No.5-84, Hasakothur, (M) Kammarpally, (D) NZB. changed my Name as **YAMAPURAM LAXMI W/o.YAMAPURAM RAJESHWAR**
**NTZ-324811**

**RECRUITMENT**

★**Pen, Pencil Company, Educated,** Unemployed Girls/Boys, Male/Female, House Wife Earn 24500-64500 Packing Work at Home 9034548725, 9728230253
**NT-3277**

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
"పేరు మార్పిడి" ప్రకటన 4 లైన్లకు 250/-
GST వర్తించును
సెల్ : 91827 77590


## మెగా హెల్త్ క్యాంప్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

ఖలీల్‌వాడి, మే 12 : జిల్లా కేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంప్‌ను ఆదివారం నిర్వహించారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పుట్టినరోజు సందర్భంగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా.. ధన్‌పాల్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆర్యవైశ్య సభ్యులు, కులస్తులు హెల్త్ చెకప్ చేయించుకున్నారు.

## ఘనంగా ఆదిశంకరాచార్యుల జయంతి



పూజలు చేస్తున్న నగర విశ్వబ్రాహ్మణ స్వర్ణకార సంఘ సభ్యులు

ఖలీల్‌వాడి, మే 12 : జిల్లా కేంద్రంలోని నాగారంలో ఉన్న వీరబ్రహేంద్ర స్వామి ఆలయంలో ఆదిశంకరాచార్యుల జయంతి వేడుకలను ఆదివారం నిర్వహించారు. నగర విశ్వబ్రాహ్మణ స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు సదానంద్, కార్యదర్శి కట్కం ప్రభు, రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణాచారి, జిల్లా ప్రధానకార్యదర్శి యాదోజు శ్రీనివాసాచారి, చంద్రశేఖర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

- అదనపు బలగాలతో పర్యవేక్షణ
- సీసీ కెమెరాలు, డ్రోన్‌లు, వీడియోల వినియోగం



బోధన్‌లో కవాతు నిర్వహిస్తున్న అదనపు బలగాలు (ఫైల్)

శక్కర్‌నగర్, మే 12: ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహించేందుకు బోధన్ పట్టణంలో పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించిన విధంగానే ఈ పోలింగ్ కూడా నిర్వహించేందుకు పోలీస్ శాఖ చర్యలు తీసుకుంది. బోధన్ నియోజకవర్గంలో పలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పోలీసులు గుర్తించారు. బోధన్ పట్టణంలోనే 29 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకంగా గుర్తించారు. ఈ కేంద్రాల వద్ద పోలింగ్ ప్రశాంతంగా జరిపించేందుకు ప్రత్యేక పోలీసు బలగాల ఏర్పాటుతో నిఘా ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల వద్ద అదనపు పోలీసు బలగాలతోపాటు, సీసీ కెమెరాలు, డ్రోన్‌లు, వీడియో చిత్రీకరణకు ఏర్పాట్లు చేశారు. ఆయా కేంద్రాల పరిధిలో నివాసం ఉంటున్న ఇంటి యజమానులకు నోటీసులు అందజేశారు. పోలింగ్ జరిగే రోజు సోమవారం ఇండ్లలో కేవలం ఇంటి యజమానులతో పాటు నిత్యం నివసించే వారు మాత్రమే ఉండాలని, కొత్త వ్యక్తులను ఉంచవద్దని పోలీసు అధికారులు సూచించారు. పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. పట్టణంలోని ప్రతి ఫంక్షన్‌హాల్‌తోపాటు, హోటళ్లు, లాడ్జీలను తనిఖీ నిర్వహించారు. కొత్త వ్యక్తులు, ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తులు ఉండకుండా చర్యలు చేపట్టారు. ఇప్పటికే సుమారు 200 మందిని బైండోవర్ చేశారు. పోలింగ్ సందర్భంగా సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆయా కేంద్రాల వద్ద 144వ సెక్షన్ అమలులో ఉంటుందని, అందరూ ఎన్నికల నియమాలు పాటించాలని పోలీస్‌శాఖ ప్రజలకు వివరించింది. ఎన్నికల నియమాలు ఉల్లంఘించిన వారిపై చట్టపరంగా చర్యలు చేపడతామని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ హెచ్చరించారు. బోధన్‌లో ఏసీపీ శ్రీనివాస్ పర్యవేక్షణలో పలువురు సీఐలు, ఎస్సైలుల నేతృత్వంలో బందోబస్తు కొనసాగించేందుకు ఏర్పాట్లు చేశారు.

## భార్య కాపురానికి రావడంలేదని వాటర్ ట్యాంక్ ఎక్కిన యువకుడు

రామారెడ్డి, మే 12: భార్య కాపురానికి రావడం లేదని యువకుడు వాటర్ ట్యాంక్ ఎక్కిన ఘటన రామారెడ్డి మండల కేంద్రంలో ఆది వారం చోటుచేసుకున్నది. ఎస్సై విజయ్‌కొండ తెలిపిన ప్రకారం.. రామారెడ్డికి చెందిన కట్ట బాబు భార్య కాపురా నికి రావడం లేదు. దీంతో మనస్తాపం చెందిన అతడు మద్యం సేవించి రథాల గైని వద్ద ఉన్న వాటర్ ట్యాంక్‌పైకి ఎక్కి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కానిస్టేబుల్ రంజిత్‌రెడ్డి ట్యాంక్‌పైకి ఎక్కి అగ్నిమాపక సిబ్బంది సహాయంతో బాబును సురక్షితంగా కిందకు దించినట్లు ఎస్సై తెలిపారు. పోలీసులు మురళీ మోహన్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.



బాధితుడిని రక్షిస్తున్న పోలీసు

## జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక

కామారెడ్డి, మే 12: తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో నిర్వహించిన అంతర్ కళాశాలల సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాల విద్యార్థులు సత్తాచాటి జాతీయస్థాయికి ఎంపికయ్యారు. రంజిత్ కుమార్, మహ్మద్ హర్షద్, గుగులోత్ సుమన్ నాయక్, బాలాజీ ఉత్తమ ప్రదర్శనతో ప్రథమ స్థానం సాధించారు. వీరు ఈ నెల 15న బెంగళూరులో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని ఇన్‌చార్జి పీడీ డాక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ్‌కుమార్, అధ్యాపకులు అభినందించారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ మృతి

రాజంపేట్, మే 12: మండలంలోని ఆర్గొండ గ్రామంలో శనివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని కుమ్మరి సత్తెవ్వ (51) మృతిచెందింది. కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్తూ రోడ్డు దాటుతుండగా టిప్పర్ ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో సత్తెవ్వ అక్కడికక్కడే మృతిచెందినట్లు ఎస్సై సంపత్ తెలిపారు.